ధాన్యం సిరులు

ధాన్యానికి ధర రావటం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ తరుణంలో లాభాలను ఆర్జించి కొంతమంది రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వరి సాగు చేసి అధిక ఆదాయం పొందడం విశేషం.

- శాస్త్రవేత్తల సూచనలతో వరి సాగు
- ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ



వేమవరంలో వ్యవసాయ పనులు చేయిస్తున్న నరసింహారావు

గుడ్లవల్లేరు: మండలంలోని కొతవరానికి చెందిన తెల్లాకుల శ్రీనివాసరరావు, రాజ్యలక్ష్మి దంపతులు అత్యధిక వరి దిగుబడులు సాధించారు. తుపాన్లకు వచ్చే ఈదురు గాలులకు నేలకు వాలనటువంటి 1318 వరి రకం విత్తనాన్ని ఈ దంపతులు పండించారు. ఈ రకం ఎక్కువ దిగుబడులు ఇస్తుందని శాస్త్రవేత్తలు చెప్పటంతో ఈ విత్తనాన్ని వేసి అత్యధిక వరి సిరులు పండించారు. వేమవరానికి చెందిన మన్నెం నరసింహారావు అనే రైతు తన పొలంలో ప్రకృతి వ్యవసాయ సాగు చేసి విలువైన ధాన్యాన్ని పండించారు. ఈ రకం వరి బీపీటీ మాదిరిగా సన్నగా ఉంటుంది. దూదేశ్వర్ అనే వరి రకం విత్తనాలను గూడూరు మండలం తలకటూరు గోశాల నుంచి ఈ రైతు తీసుకొచ్చారు. ఇది వందేళ్ల క్రితం రకం విత్తనమే. ఈ వరి అన్నం తింటే మనుషులు చాలా బలంగా ఉంటారు. ఇది తుపాన్లకు దెబ్బతినని వరి రకం.



కొతవరంలో తాము పండించిన ధాన్యాన్ని చూపుతున్న శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి

ఎకరాకు 47 బస్తాలు పండించాం



ఎకరానికి 47 బస్తాల వరి పండించాం. అలా రెండు ఎకరాల్లో పంట దిగుబడులు వచ్చాయి. 1318 వరి రకం సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయి. అందుకే ఈ విత్తనాన్ని సాగు చేశాం. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఈ విత్తనాన్ని వేయటంతో వరుస తుపాన్లకు కూడా వరి పైరు నేలకు వాలలేదు. మొన్న వచ్చిన తుపానుకు తడిసిన పొలాన్ని ఆరబెట్టి వరి కోతలు కోశాం. సాగు ఆరంభం నుంచి ధాన్యం మిల్లుకు వెళ్లేవరకు ఎకరానికి వ్యవసాయ ఖర్చులు మొత్తం రూ.25 వేలు అయ్యాయి. ధాన్యం అమ్మితే ఎకరానికి రూ.68 వేలు వచ్చాయి. రెండు ఎకరాలకు రూ.1.36 లక్షలు వచ్చాయి. రూ.50 వేలు ఖర్చు పోగా రూ.86 వేలు లాభం వచ్చింది.

– తెల్లాకుల శ్రీనివాసరరావు, రాజ్యలక్ష్మి, కొతవరం

ఎకరం సాగుకు రూ.82 వేల లాభం



ఎకరానికి 20 బస్తాలే ధాన్యం పండినా రూ.లక్ష వచ్చాయి. ఒక్కో బస్తాను రూ.5వేలు చొప్పున ప్రకృతి ప్రేమికులు కొనుగోలు చేస్తున్నారు. తుపానుకు వరి పైరు తలలు వాలటమే తప్ప పడలేదు. ప్రకృతి వ్యవసాయం చేయటం వలన ఎకరానికి కేవలం రూ.18 వేలే అయింది. దీనిలో సాగుకు రూ.3 వేలు ఖర్చయింది. వరికోత, కట్టేత, కుప్ప నూర్పిళ్లకు ఎకరానికి రూ.15వేలు ఖర్చయింది. ఎకరానికి రూ.82 వేలు లాభం వచ్చింది. ఎకరన్నరంలో ఈ సాగు చేస్తే ఖర్చులు పోగా రూ.1.23 లక్షల లాభం వచ్చింది. రసాయనాలు, పురుగు మందుల ఖర్చులు లేకపోవడం, వందేళ్ల క్రితం విత్తనాన్ని వాడటం వలన అధిక లాభం వచ్చింది.

– మన్నెం నరసింహారావు, వేమవరం, గుడ్లవల్లేరు మండలం

క్లుప్తంగా

రేపు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పమిడిముక్కల: మండలంలోని తాడంకి గ్రామంలో నాయకుడు యేనుగ మస్తాన్‌రావు నివాసంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల తాకిడి అధికమైంది. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

గిట్టుబాటు ధరకే ధాన్యాన్ని విక్రయించండి

పామర్రు: రైతులు ప్రభుత్వం ఇచ్చిన గిట్టుబాటు ధరకే తమ ధాన్యాన్ని విక్రయించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని వరి కోత మిషన్ ద్వారా నూర్చిన ధాన్యాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎవరూ అధైర్య పడవద్దన్నారు. అందరి వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. మధ్య వర్తులను దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని పేర్కొన్నారు. మిల్లర్ల ఎవరైనా ఇబ్బందులు పెడితే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలన్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధనే లక్ష్యం



నిమ్మకూరు(పామర్రు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించి వారి అభ్యున్నతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విధులు నిర్వహించాలని సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ మస్తానయ్య పేర్కొన్నారు. మండలంలోని నిమ్మకూరు జెడ్పీ హైస్కూల్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీ సభ్యులు తరచూ పాఠశాలను తనిఖీలు చేస్తూ ఉండాలన్నారు. పామర్రు ఎంపీపీ అశోక్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీలత పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 518మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆదివారం విజయవాడ కామినేని హాస్పిటల్, విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, గుడివాడ హోమియో డాక్టర్ భవాని, హైదరాబాదు మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ హరిహర్ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ వెంకట్రావు తెలిపారు.

రేపటితో ముగియనున్న ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

మొవ్వ: కృష్ణా–గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల నమోదు ఈ నెల తొమ్మిదో తేదీతో ముగియనుందని తహసీల్దార్ కే మస్తాన్ శనివారం తెలిపారు. అర్హులైనవారు ఫారం–18ను పూర్తి చేసి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయవచ్చని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



గుడివాడ టౌన్: గుడివాడ రూరల్ మండలం గుంటాకోడూరులో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పిన్నమనేని పూర్ణ వీరయ్య(బాబ్జి), వాసె మురళి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తల్లిదండ్రుల సమావేశం



కైకలూరు: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శనివారం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్సాహంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కైకలూరు, భుజబలపట్నం ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో శనివారం పాల్గొన్నారు. అనంతరం తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం, ఎంఈఓలు రామారావు, శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు రాజేశ్వరీ, ముబీన్ బేగం పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కొతవరం జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన మెగా మీటింగ్‌కు ముఖ్య అతిథిగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విచ్చేశారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ విజయసారథి, ఎంఈఓలు జి.గోపాలరావు, జగన్మోహనరావు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు



గుడివాడలో స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



గుడ్లవల్లేరు మండలం కూచికాయలపూడిలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోని షష్ఠి ఉత్సవాలకు శనివారం భక్తులు పోటెత్తారు. ఉత్సవాలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పుట్టలో పాలు పోసి ప్రారంభించారు. వేకువజామునే జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామివారి పుట్టలో పాలు పోసేందుకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షణ చేశారు.

పామర్రులో..

పామర్రు: మండంలోని పలు ఆలయాల్లో సుబ్రమణ్య షష్ఠి మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, పెదమద్దాలి గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేషంగా అభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని భక్తిశ్రద్ధలతో కొలిచారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ జయమంగళ

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామిని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యుడు రవికుమార్ తదితరులు జయమంగళ వెంకటరమణను స్వామివారి చిత్రపటంతో సత్కరించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కూచికాయలపూడిలో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కార్యక్రమాన్ని శనివారం కనుల పండువగా నిర్వహించారు. పొట్లూరి ఈశ్వరరావు, అన్నపూర్ణ ఆధ్వర్యంలో స్వామి కల్యాణ మహోత్సవాన్ని చేపట్టారు. తొలుత స్వామివారి పుట్టలో భక్తిప్రపత్తులతో అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి పాలు పోశారు.



ముదినేపల్లిలో ఎమ్మెల్సీ జయమంగళకు సత్కారం



ముదినేపల్లిలో వల్లీదేవసేన సమేత సుబ్బారాయుడు

గుడివాడలో..

గుడివాడ టౌన్: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి కల్యాణం శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో, ఆటోనగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.

కనుల పండువగా సుబ్బారాయుడి కల్యాణం

ముదినేపల్లి రూరల్: షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం శనివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శ్రీవల్లీదేవసేన అమ్మవార్లను సుందరంగా అలంకరించి వేదికపై ఉంచి ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పాలకవర్గ సభ్యులు కల్యాణ వేదికపైకి తోడ్కొని వచ్చారు. అనంతరం కల్యాణ వేదికపై వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం మధ్య కల్యాణతంతు నిర్వహించారు.

కైకలూరులో..

కైకలూరు: మండలంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కలిదిండి మండలం పెదలంక నాగేంద్రస్వామి ఆలయంలో భక్తులు శనివారం ఉదయం పుట్టలో పాలు పోసి ఉత్సవాన్ని ప్రారంభించారు. కై కలూరు చిన్న చెరువు గట్టు నాగేంద్ర స్వామి దేవాలయం, ఆచవరం సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు.



పుట్టలో పాలు పోస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



పాలు పోసేందుకు పుట్ట వద్ద వేచియున్న భక్తులు



పామర్రు వల్మీకేశ్వరీ ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు



తోట్లవల్లూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

చదువుకుంటేనే అభివృద్ధి సాధ్యం

పమిడిముక్కల: చదువుకుంటేనే అభివృద్ధి సాధ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పక చదివించుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. చోరగుడి హైస్కూల్లో జరిగిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పీటీఎం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, ఎంఈఓ శ్రీనివాస్, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మేడూరు హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైస్కూల్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు ఘనంగా నిర్వహించారు.

మొవ్వలో..

మొవ్వ: మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లకు విశేష స్పందన లభించింది. అయ్యంకిలోని ఎంపీపీఎస్ పాఠశాల్లో ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ వి.శివరామ కృష్ణ అధ్యక్షతన సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యారుథలకు బహుమతులను అందజేశారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశాలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ముదినేపల్లి జెడ్పీ హైస్కూల్లో నోడల్ ఆఫీసర్, కార్మిక శాఖ ఉప కమిషనర్ కె.శ్రీనివాస్, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, వీరమల్లు నరసింహారావు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, బాలబాలికలకు ఆటల పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులు నిరంతరం విద్యనభ్యసిస్తూ క్రమశిక్షణతో మెలగాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు ఎమ్మెల్యే అందజేశారు. కొండిపర్రు గ్రామంలోని ఎంపీయూటీ పాఠశాలలో మెగా పేరెంట్స్ డేను నిర్వహించారు.



పమిడిముక్కల మండలం చోరగుడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు జెడ్పీ హైస్కూల్లో మెగా పేరెంట్స్ డేను శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గౌడ వెల్ఫేర్ కౌన్సిల్ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి హాజరై వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మండవల్లిలో..

అయ్యవారి రుద్రవరం పాఠశాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండవల్లి మండల విద్యాశాఖాధికారి ఎస్.రత్నసునాదం హాజరయ్యారు. హెచ్‌ఎం సీహెచ్ పిచ్చోడు పాల్గొన్నారు.

జమీదగ్గుమిల్లిలో..

జమీదగ్గుమిల్లి(పామర్రు): ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు సమన్వయంగా ఉంటూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లి జెడ్పీ హైస్కూల్ మెగా పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, రమాదేవి, సర్పంచ్ కె.చంద్రశేఖర్‌రావు, హెచ్‌ఎం హనుప్రసాద్ పాల్గొన్నారు.



గుడివాడ మాంటిస్సోరి హైస్కూల్లో ముగ్గుల పోటీల్లో విజేతలు

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

పామర్రు: ప్రభుత్వ పాఠశాల్లో పని చేస్తున్న స్వీపర్లు, హైస్కూల్ నైట్ వాచ్‌మెన్ జీతాలు ఐదు నెలలుగా ప్రభుత్వం చెల్లించడం లేదని, వాటిని వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఒడుగు గంగాధర ప్రసాద్, మండల అధ్యక్షుడు ఇంటిరాజు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నాయకులు శనివారం మాట్లాడారు. ఆయాలలో చాలా మంది రెక్క ఆడితేగాని డొక్కాడని బడుగు జీవులన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే బడుగు జీవుల వేతనాలను చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి ఉన్న జీతాలను చెల్లించాలన్నారు. లేనిచో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర ప్రసాద్, మండల అధ్యక్షుడు రాజు

నేడు ఉచిత మధుమేహ వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ



మైక్‌ను అందజేస్తున్న దాతలు

గుడ్లవల్లేరు: వెణుతురుమిల్లి మండల పరిషత్ యూపీ స్కూల్‌కు కొల్లిపర పార్థసారథి, అనసూయ కుమారుడు సత్యనారాయణ శనివారం రూ.12 వేల విలువైన మైక్‌సెట్‌ను అందజేశారు. దాతలకు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.కృష్ణలక్ష్మి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

పెనమలూరు: కానూరులో వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. వృద్ధ దంపతులు తుమ్మల సాధ్వి, శ్యామ్‌ప్రసాద్ కానూరులో నివాసం ఉంటున్నారు. కాగా గురువారం వారు మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత నిద్రపోయారు. భర్త శ్యామ్‌ప్రసాద్ లేచి చూడగా భార్య సాధ్వి కనబలేదు. దీంతో బెంగళూరులో ఉంటున్న కుమారుడు వేణుకు సమాచారం ఇచ్చాడు. వేణు కానూరుకు వచ్చి తల్లి కోసం వెతుకగా ఆమె కనబడలేదు. దీంతో తన తల్లి కనిపించడం లేదంటూ వేణు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ఉయ్యూరు: విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం శాస్త్రవేత్త శైలజారాణి సూచించారు. పట్టణంలోని ఎంకే ఇంగ్లిష్ మీడియం పాఠశాల్లో పౌష్టికాహార పదార్థాలపై శనివారం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలను శైలజారాణి రుచి చూసి విజేతలను నిర్ణయించారు. ఆయా విభాగాల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనతను అధిగమించేలా ఆహార అలవాట్లు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ ఎంకే బాబు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శాస్త్రవేత్త శైలజారాణి